ప్రజాజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 27 | మార్చి | 2024 | పేజీలు: 4



## పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక అలా



4లో



# ఎండలతో... జర పైలం..!



n ఇల్లందు, ప్రజాజ్యోతి

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- దంచికొడుతున్న ఎండలు
- అల్లడిపోతున్న జనం
- ఉపశమనం కొరకు నానా తంటాలు
- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- వడదెబ్బ నుంచి రక్షణ అనివార్యం

**తెలంగాణాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 11 దాటిదంటే కాలు తీసి బయట పెట్టాలంటే జనాలు జంకుతున్నారు. అంతలా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.**

ఈతరుణంలో వేసవిలోని ఎండల నుంచి తగిన జాగ్రత్తలు తప్పనిసరి అంటూ ఆరోగ్య శాఖ ఓ వైపు హెచ్చరికలు చేస్తుండగా మరో వైపు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే మొదటికే మోసం వస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివరాలు 2వ పేజీలో..

## పిచ్చికుక్కదాడిలో చిన్నారులకు గాయాలు




*బూర్గంపహాడ్, మార్చి 26, ప్రజాజ్యోతి*

4 గురు చిన్నారులను ఇద్దరు పెద్దవారిపై పిచ్చికుక్క దాడి చేసిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గాయపడిన వారిని బూర్గంపహాడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారి వివరాలు కేసు పాక భవ్యశ్రీ కొమ్మనాపల్లి హేష్ బాబు, ఇనపనూరి చిన్నారి, జైనబ్, లతో పాటు పుట్టి సీతారాములు, మరొకరికి గాయాలైనట్లు తెలిసింది. గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం కొనుగోలు
- చివరి గింజ వరకు మద్దతు ధర పై కొనుగోలు
- త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- ధాన్యం కొనుగోలు, త్రాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- సమీక్షించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి




*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మార్చి 26, ప్రజాజ్యోతి*

యాసంగి 2023-24 ధాన్యం వరి కోతల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో త్రాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడిఓసి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యా చందన లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతల ప్రకారం ధాన్యం కొనుగోలు

మిగతా 2లో..

# ఎండలతో జర పైలం....!

**ఇల్లందు, మార్చి 25, ప్రజాజ్యోతి:** తెలంగాణాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 11 దాటిదంటే కాలు తీసి బయట పెట్టాలంటే జనాలు జంకుతున్నారు. అంతలా భానుడు తన ప్రతాపాన్ని చూపుతు న్నాడు. ఈతరుణంలో వేసవిలోని ఎండల నుంచి తగిన జాగ్రత్తలు తప్పనిసరి అంటూ ఆరోగ్య శాఖ ఓ వైపు హెచ్చరికలు చేస్తుండగా మరో వైపు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే మొదటికే మోసం వస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసుకునే దుస్తుల నుంచి తీసుకునే ఆహారం వరకు అన్ని రకాలుగా జాగ్రత్తలు పాటించి ఈ వేసవి నుంచి ఉపశమనం పొందాలని సూచిస్తున్నారు. ఇక వడదెబ్బ తగిలితే నిపుణుల సూచనలతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని లేకుంటే ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



### అల్లాడుతున్న జనం

ఉదయం 8గంటల నుండే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకే రోడ్లు పూర్తిగా నిర్మానుష్యంగా మారుతున్నాయి. దంచికొడుతున్న ఎండలకు తోడు ఉక్క పోత,వేడి గాలులు కూడా తోడవడంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనేపథ్యంలోనే రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ సైతం తప్పని పరిస్థితుల్లో మాత్రమే ఉదయం 11:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావాలని లేని పరిస్థితుల్లో ఇంటి పట్టునే ఉండాలని సూచిస్తుంది. ఇక వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ సూచించడం జరుగుతుంది.

### వేసవి నుంచి ఉపశమనం కోసం జనాల తంటాలు

దంచికొడుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు జనాలు నానా తంటాలు పడుతున్నారు. ఇంటి పట్టునే ఉండేందుకు వీలైనంత వరకు ప్రయత్నిస్తున్నారు. పగటి పూట ఏసీలు, కూలర్లు వాడడం ద్వారా శరీరాన్ని చల్ల బర్చుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. ఇక ఫ్రిజ్ ల కొనుగోళ్లు,ఏసీల అమ్మకాలు పెరిగాయి. సామాన్యుడు మట్టి కుండల కొనుగోళ్లపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఇక తీసుకునే ఆహారంలో కూడా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఎక్కువగా నీటి శాతం ఉండే కూరగాయలను వండుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఆహారం కంటే ఎక్కువగా నీరు,పానీయాలు,జ్యూస్ లపై మక్కువ పెంచుకుంటున్నారు.

### లక్షణాలు గుర్తించి వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇక వేసవిలో ఎక్కువగా వినిపించే మాట వడదెబ్బ. వడదెబ్బ నుంచి మనల్ని మనం రక్షించుకునేందుకు సంసిద్ధంగా ఉండాలి. లక్షణాలు గుర్తించి వెంటనే అప్రమత్తమైతే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చు. వడదెబ్బ లక్షణాలు ముఖ్యంగా చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, శరీరం వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింపులు,ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి చేరుకోవడం వంటి లక్షణాలు రోగి శరీరంలో కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు గమనించి సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడలోకి తీసుకొచ్చి శరీర ఉష్ణోగ్రత చల్లబడేలా చూడడం చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం అంతా తుడ్చాలి. చల్లని గాలి తగిలేలా ఫ్యాన్ లేదా చెట్ల కింద కూర్చోబెట్టాలి. ఉప్పు కలిపిన మజ్జిగ కానీ చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం పట్టించడం లేదా ఓరల్ రి హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారకంగా ఉన్న రోగికి ఎట్టి పరిస్థితుల్లో నీరు తాగ్గించవద్దు. వీలైనంత త్వరగా దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.



## వేసవిలో తగు జాగ్రత్తలు తప్పనిసరి

**డా.రవి బాబు, డిసిహెచ్ ఎస్, భద్రాద్రి కొత్తగూడెం**



వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందాలంటే తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు బయటకు పోకపోవడమే ఉత్తమం.వేసవిలో కాటన్ దుస్తులతో పాటు తలగడ ధరించడం మంచిది. కళ్ళజోడు తప్పనిసరిగా వాడాలి. బయటకు వెళ్లే సమయంలో గొడుగు తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరగకుండా ఎక్కువగా లిక్విడ్ తీసుకోవాలి. పండ్ల రసాలతో పాటు మజ్జిగ తీసుకోవడం మంచిది. వడదెబ్బ తగిలితే వెంటనే రోగి శరీరాన్ని చల్ల బరచాలి. ఇందుకోసం రోగిని నీడకు తీసుకెళ్లి తడిబట్టతో శరీరాన్ని తుడిచి సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

---

(మొదటి పేజీ తరువాయి)

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తననియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని, ఎక్కడా ప్రజా ప్రతినిధులు పాల్గొనవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో వరికోతల ననుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు షెడ్యూల్ రూపొందించుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. యాసంగి పంట కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సిఎస్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సన్నద్ధం చేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశం రైతుల వద్దకు వెళ్లేలా అవగాహన కల్పించాలని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతంపై విస్తృత అవగాహన కల్పించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకుని వచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరిసాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.




వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని,సిఎంఆర్ రా రైస్ డెలివరీ పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న త్రాగునీటి వ్యవస్థను ఒకసారి పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు పూర్తిచేయాలని తెలిపారు. త్రాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలని ప్లాన్ బీ తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి మున్సిపాలిటీలో చివరి వార్డ్, గ్రామాలలో చివరి ప్రాంతం వరకు త్రాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి సరఫరాకు సంబంధించిన ప్రతి అంశాన్ని రోజు పర్యవేక్షించాలని, ప్రజలకు నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నయ ఏర్పాట్లు సత్వరమే చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ఇతర సామాగ్రి సన్నద్ధం చేస్తున్నామని, వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ,రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో లక్ష 11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా తో 127 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను. కొనుగోలు కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై చెక్ లిస్ట్ జారీ చేస్తామని ఆ ప్రకారం ఏర్పాట్లు చేసి ధృవీకరణ పత్రం జారీ చేయాలని ఆదేశించారు. మన జిల్లాకు సమీప రాష్ట్రాల నుండి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దుల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేయాలని చెక్పోస్టుల వద్ద రెవెన్యూ పోలీస్ మరియు అగ్రికల్చర్ అధికారులు విధులు నిర్వహించే విధంగా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశిం చారు. సీఎంఆర్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు ఎటువంటి తేడాలు ఉన్న కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు ఇంచార్జ్ అధికారులను నియమించాలని, కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, టార్పాలిన్లు, మొదలగు అన్ని సౌకర్యాలు కనిపించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని, సీఎంఆర్ మిల్లులను తనిఖీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి ని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ ఈ సదాశివం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, డిఎం సివిల్ సప్లై త్రినాథ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కంటోన్మెట్ టికెట్ పిడమర్తి రవికి కేటాయించాలి

## మాదిగ జేపసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు

మణుగూరు, మార్చి 26, ప్రజాజ్యోతి

కంటోన్మెంట్ టికెట్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పిడమర్తి రవికి కేటాయించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు ప్రకటనలో తెలిపారు. మంగళవారం మణుగూరు పట్టణ కేంద్రంలోని బిఆర్. అంబేద్కర్ కూడలిలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని, రెండు ఎంపి స్థానాలు మాలలకు కేటాయించారనీ, మాదిగలకు కూడా



రెండు స్థానాలు కంటోన్మెట్ డా. పిడమర్తి రవి మాదిగకు, రెండవది వరంగల్ పార్లమెంట్ స్థానం మాదిగలకు ఇచ్చి సమన్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ కోరారు. ఉద్యమనాయకుడు, తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యభూమిక పాత్ర పోషించి, 288 పైగా కేసులు మీద వేసుకొని, రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు,అతి పెద్ద మాదిగ కులానికి నాయకత్వం వహిస్తున్న డా. పిడమర్తి. రవికి కంటోన్మెట్ నియోజకవర్గ సీటు కేటాయించాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరినారు. ఈ సమావేశంలో మణుగూరు మండల అధ్యక్షుడు రావులపల్లి వెంకటేశ్వర్లు వేంపల్లి సతీష్ ఇసుకల కృష్ణ ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కరకగూడెం, మార్చి 26, ప్రజాజ్యోతి

కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో యేసయ్య ఆశీర్వాద ప్రార్థన మందిరము నందు సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ చిట్టి బాబు, కరుణశ్రీ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంట్లోనే ఉండకుండా కుట్లు, అల్లికలు నేర్చుకుంటూ ఆర్థికంగా ఎదగాలి అనుకునే మహిళలకు చక్కటి అవకాశం దక్కిందన్నారు. ఇలాంటి శిక్షణ కేంద్రాలు మహిళల ఎదుగుదలకి ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వాలు కూడా మహిళల సాధికారతకు తోడ్పాటుని అందిస్తున్నందున ఏజెన్సీ ప్రాంత ఆడబిడ్డలు అందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలన్నారు. అలాగే సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి చక్కని శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినందుకు ట్రస్ట్ సభ్యులని అభినందించారు. ఈ కార్యక్రమం లోదైవజ్ఞులు జొషఫ్ గారు, బీలపాటి సంపత్ కుమార్ గారు గ్రామస్తులు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# రైతు అవగాహన సదస్సు ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బూర్గంపహాడ్, మార్చి 25, ప్రజాజ్యోతి

రైతు అవగాహన సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు వేదిక నందు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేలచే రైతు నేస్తం పేరుతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు నేరుగా సలహాలు, సూచనలు దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు చేరాలనే సంకల్పంతో రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు వివిధ రకాల సమగ్ర వ్యవసాయ యాజమాన్యం గురించి, పశు సంరక్షణ గురించి శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ తాతారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ఏఈవోలు జెవిడి ప్రసాద్, రవితేజరెడ్డి, నాగ వైష్ణవి, రైతులు మారం శ్రీనివాసరెడ్డి, కైపు రోశిరెడ్డి, గాదె నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# శంకరయ్య పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

మణుగూరు, మార్చి 26, ప్రజాజ్యోతి

మణుగూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారివీరముష్టి శంకరయ్య మరణించిన విషయం తెలుసుకొని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి పార్దివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీరినాకి నవీన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# వివాహిత ఆత్మహత్య

## అదనపు కట్నం కోసం వేధింపులు

అశ్వారావుపేట, మార్చి 26, ప్రజాజ్యోతి:

అదనపు కట్నంకోసం భర్త, అత్తమామలు వేధింపులు తాగలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కాపవరం గ్రామానికి చెందిన కంపసాటి నాగమణికి గుర్రాలచెరువు గ్రామానికి వెంకన్నబాబుకు వివాహం జరిగింది. గత కొంతకాలంగా భర్త వెంకన్నబాబు, అత్త భూలక్ష్మి, మామ నాగయ్య, నాగమణి ని అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తు న్నారు. అవి వేధింపులు తాళలేక మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్ప డింది. కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్సకోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగ అప్పటికే నాగమణి మృతి చెందింది. మృతురాలి తల్లి రమణ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపారు.

ఇద్దరువ్యక్తుల మధ్య ఘర్షణ

# గొడ్డలితో దాడి

అశ్వారావుపేట, మార్చి 26, ప్రజాజ్యోతి:

వారిద్దరూ స్నేహితులే కానీ మద్యం వారిని శత్రువులుగా మార్చి చివరకు దాడి చేసుకునే వరకు తీసుకొచ్చింది... వివరాల్లోకి వెళితే మండలంలోని నందమూరి కాలనీకి చెందిన మడకం చిన్న, రంజాన్ ఇద్దరు స్నేహితులు లారీ క్లీనర్లుగా పనిచేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వీరిద్దరూ తమ తమ డ్యూటీలు ముగియడంతో పట్టణంలోని ఓ బెల్ట్ షాప్ దగ్గరికి వెళ్లి మద్యం సేవించారు. ఆ సమయంలో ఓ చిన్న విషయంలో ఇద్దరు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకొని ఘర్షణకు దిగారు.. అక్కడ వ్యవహారం చల్లబడి ఎవరికి వారు వారి ఇళ్లకు వెళ్లిపోయారు. అనంతరం మంగళవారం ఉదయం మడకం చిన్న, రంజాన్ ఇంటికి వెళ్లి ముందు రోజు రాత్రికి జరిగిన విషయంపై ఘర్షణకు దిగడంతో రంజాన్ సహనం కోల్పోయి చిన్నపై గొడ్డలితో దాడి చేశాడు. కాలనీవాసులు వెంటనే స్పందించి పోలీసులు సమాచారం ఇచ్చి గాయపడిన చిన్నాని ప్రభుత్వ హాస్పటల్ తరలించి వైద్యం అందించారు. పోలీసులు రంజాన్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు.

# మానవత్వం చాటుకున్న చేయూత ట్రస్ట్



బూర్గంపాడు, మార్చి 26, ప్రజాజ్యోతి

మండల పరిధిలోని మోరంపల్లి బంజరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన గొల్లమందల రమణ గుండె జబ్బు వ్యాధితో బాధపడుతుండగా బంజరు గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ వారు మంగళవారం ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. గొల్లవందల రమణ కి భర్త చనిపోయి చాలా సంవత్సరాలయింది. ఒంటరిగా ఉంటూ చెయ్యందించే వారు లేక ఒకరోజు కూలికి పోతే వచ్చే డబ్బులతో రెండు మూడు రోజులు పూట గడుపుకోవాల్సి వస్తుందనీ పూర్తిస్థాయిలో ఆరోగ్యం సహకరించక తెలిసిన చోట అప్పులు చేసి ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిన పరిస్థితిలో ఉన్నాయి. ఆమె దాతల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో చేయూత ట్రస్ట్ స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు విద్య వైద్య రంగాలను ఎంచుకొని సహాయ సహకారాలు అందిస్తూ చేయూత ట్రస్ట్ చేస్తున్న సేవలకు పలువురు అభినందిస్తున్నారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో చేయూత ట్రస్టు ఆర్థిక సహాయం చేయడమే కాకుండా తెలిసినవారిని పలువురు చేత ఆర్థిక సహాయం అందించడంలో ముందుండి అందిస్తున్న సేవలు పై చేయూత ట్రస్ట్ వారి పై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది దాతలు గుండె జబ్బు వ్యాధితో బాధపడుతున్న గొల్లమందుల రమణ కి ఆర్థిక సాయం అందించి ప్రాణాన్ని కాపాడాలని ఆమె వేడుకుంటుంది. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, గౌరవ అధ్యక్షులు కే. వెంకటేశ్వర్లు,వైస్ చైర్మన్ కే నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, ట్రెజరరీ పుట్టి రాజేష్, సహాయ కార్యదర్శి గాది నర్సిరెడ్డి, కార్యవర్గ సభ్యులు కైపు రామచంద్రారెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, సెనగ మల్లేశ్వరరావు, కైపు చిన్న నాగిరెడ్డి, కైపు వెంకట నాగిరెడ్డి, బి. వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని, ఎస్సీ కాలనీ యూత్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసాద్ రెడ్డికి ఎంపి టికెట్ ఇవ్వాలని పూజలు

ఇల్లందు, మార్చి 26, ప్రజాజ్యోతి: కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి ఖమ్మం యంపి టికెట్ పొంగులేటి ప్రసాద్ రెడ్డికి కేటాయించాలని కోరుతూ మంగళవారం పిఎస్ఆర్ ఉమ్మడి జిల్లా నాయకులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలన అద్భుతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.



ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 9 సీట్ల గెలుపులో పొంగులేటి కృషి ఎంతో ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి పొంగులేటి ప్రసాద్ రెడ్డికి ఖమ్మం ఎంపీ టికెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఆర్ నాయకులు ఆవునూరు గణేష్, కాంగ్రెస్ నాయకులు సుమిత్ కోరి, పోదుగు రాంబాబు, కొండూరు రాజీవ్ గాంధీ, అయ్యప్ప, ఎర్రబెల్లి రాజశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మార్చి 26, ప్రజాజ్యోతి




జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. మంగళ వారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం లో సంబంధిత అధికారులతో కలిసి ఎన్ఐసి వారు రూపొందించిన సాఫ్ట్ వేర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, భద్రాచలం, అశ్వరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 9 ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్ల ప్రపోజల్ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల అధికారి గారికి పంపడం జరిగినది. మొదటి రాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా 1401 ప్రిసైడింగ్ అధికారులు, 1401 సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 2827 ఓపిఓలు ను కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ డి వేణుగోపాల్, ఎలక్షన్స్ సూపరిండెంట్ ధారా ప్రసాద్, రంగా ప్రసాద్, ఎన్ఐసి డిఐఓ సుశీల్ కుమార్, డిఎల్ఎంటిపి సాయి కృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్ సంబంధిత అధికా రులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రమాదాలకు యాజమాన్యమే బాధ్యత వహించాలి

- ఐఎన్టీయుసీ మణుగూరు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు



మణుగూరు, మార్చి 26, ప్రజాజ్యోతి

సింగరేణి లో జరుగుతున్న ప్రమాదాలకి యజమాన్యమే బాధ్యత వహించాలని మణుగూరు ఏరియా ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు కృష్ణంరాజు ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక ఐఎన్టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గత నెల రోజులుగా జరుగుతున్న వంటి వరుస ప్రమాదాలకు సింగరేణి యాజమాన్యమే పూర్తి భాధ్యత వహించాలని అన్నారు. సింగరేణిలో కొంత కాలంగా రక్షణ కమిటీలు నిర్వహించడం లేదని, పలురకలా సకులతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. గత కొంతకాలంగా మణుగూరు ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ కు, ఇతర అన్ని విభాగాల అధికారులకు సేఫ్టీ కమిటీలు నిర్వహించాలని చెబుతున్నప్పటికీ ఎవరు స్పందించడం లేదన్నారు. అధికారులకు ఉత్పత్తి పై వున్న శ్రద్ధ కార్మికుల భద్రత పై లేదన్నారు. కొన్ని డిపార్ట్మెంట్ గనులలో కార్మికులు తక్కువగా ఉన్నారని సకుచూపుతు సేఫ్టీ కమిటీ నిర్వహించడం లేదన్నారు. ఇకనైనా కార్మికుల భద్రత దృశ్య, జరుగుతున్న ప్రమాదాల దృశ్య తక్షణమే భద్రతా కమిటీలు నిర్వహించాలని అధికారులను డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు గట్టయ్య యాదవ్, ఎస్ రాములు, షబీద్దూన్, చీఫ్ ఆర్గనైజర్ సెక్రెటరీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైఎఫ్సీహెచ్ఎస్ ఆధ్వర్యంలో 'పది' విద్యార్థులకు సువర్ణ అవకాశం

బూర్గంపహాడ్, మార్చి 26 ప్రజాజ్యోతి



బూర్గంపహాడ్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వైఎఫ్సీ హెచ్ఎస్(యూత్ ఫర్ కాంపిటేటివ్ అండ్ హెల్తీ సొసైటీ) ఆధ్వర్యంలో సూర్యం మెమోరియల్ అవార్డు కింద బహుమతులు అందించడం జరుగుతుందని వైఎఫ్సీహెచ్ఎస్ నిర్వాహకులు తేజావత్ జానకిరామ్ మంగళవారం తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండవ బహుమతి రూ. 5వేలు, మూడవ బహుమతి రూ. 2500 అందించడం జరుగుతుందని, ఇద్దరికి ఒకే మార్కులు వస్తే లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు www.yfchs.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆ వివ రాలను సేకరించి అర్హులైన వారికి పై చదువుల నిమిత్తం ఈ అవార్డుతో పాటు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. వీటితో పాటు మ్యాథ్స్, ఇంగ్లీష్ రెండు సబ్జెక్టుల అత్యధిక మార్కుల ఆధారంగా కన్సోలేషన్ కింద రూ. 1000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ భాగంగా యూత్కు క్రికెట్ టోర్నమెంట్, రైతులకు వ్యవసాయ మెలకువలపై రైతుసెమినార్లు, ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, పూర్తి వివరాలకు 9949111876, 96769399440 సంప్రదించాలని కోరారు.

# వాహనాల తనిఖీలు



ఇల్లందు, మార్చి 26, ప్రజాజ్యోతి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులలో మంగళ వారం ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్ర భాను వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వే బ్రిడ్జ్ కోల్ లారీ లోడింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మణుగూరు, మార్చి 26, ప్రజాజ్యోతి

సింగరేణి వేబ్రిడ్జ్ కోల్ లారీ లోడింగ్, అన్ లోడింగ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి వారికి ఇస్తున్న వేతనాలను అలాగే మెడికల్, ఎంవీటిసి నీ ఉచితంగా సింగరేణి సంస్థ చేయించాలని, సీఎంపిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను వారికి కేటాయించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జక్కుల రాజబాబు, కృష్ణ, సిహెచ్ శంకర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకీ నవీన్, గాండ్ల సురేష్, సుధాకర్, టౌన్ ప్రెసిడెంట్ భువనగిరి శివ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ బాధితుడికి వాసవి క్లబ్ ఆర్థిక సాయం




మణుగూరు రూరల్, మార్చ్ 26, ప్రజాజ్యోతి

మణుగూరు పట్టణానికి చెందిన శ్రీనివాసరావు (వేణు) ఫ్లెక్సీ షాప్ లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డయాలసిస్ కారణంగా అనారోగ్యంతో బాధపడుతూ కాలం వెళ్లదీస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతుండగా ఈ విషయం తెలుసుకున్న మణుగూరు వాసవి క్లబ్, వాసవి వనితా వైభవ్ ఆధ్వర్యంలో బాధితునికి 5 వేల ఆర్థిక సాయాన్ని దొసపాటి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు శక్తి మేరకు సాయం అందించడంలో వాసవీ క్లబ్ మణుగూరు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, వాసవి వనిత వైభవం ప్రతినిధులు ఐపీసీ బండారు నరసింహారావు, జోన్ చైర్మన్ చిట్టూరి శేషుకుమార్, కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, మిట్టపల్లి శ్యామ్, దింటకుర్తి బ్రహ్మయ్య, చిత్తలూరి రమేశ్, మురహరి తదితరులు పాల్గొన్నారు.